## ౫ ఆకుపచ్చరంగు

సాయంకాల విహృతులందు స్నేహితులూ నేనూ వివిధా శాల మీద వ్యాఖ్యానాలు చేసుకొంటూ పోతూంటాం. ఆలాటి ఓసందర్భంలో కొన్నాళ్లై నే నన్నాదేమీలేదు "ఇప్పు డాడవాళ్ళుకట్టే చీర్ల రంగూ రైకల రంగూ చూచేరా? అంతా ఆకుపచ్చ మయంగావుంది. కొన్నాళ్ళక్రింద ఎక్కడచూచినా నారపట్టునిగనిగ. అదిపోయి యిదొచ్చింది" అన్నాను. నేనన్నది నేనప్పుడే మఱచిపోయినాను. మళ్ళా రోజూ ఆడవా ళ్ళాలాంటి రంగుచెంగులూచుకుంటూనే పోతున్నారు రాజమార్గాన్నే. కాని నాకా యూసే లేదు. నా మిత్రునకది మనస్థగితమై పోయింది కామోసు. మఱి పదేనురోజుల కడిగేడు "ఏమోయి నీవన్నమాట నిజమే. ఈ పది హేను రోజుల్నుంచీ చూస్తున్నాను. ఎక్కడ చూచినా బీదవాళ్ళనుండి భాగ్యవంతులుదాకా ఆకుపచ్చచీరలూ ఆకుపచ్చ రైకలేనోయి!" అన్నాడు. "అందుకే అన్నాను" అని పరధ్యానంగా నడుస్తున్నా. స్నేహితుడు "ఏమోయి, నేడు నీకు కనువిందవడంలే ఆ అద్దకం?" అన్నాడు. నేనన్నాను "కాదు. నాదృష్టిప్పుడు — చెట్లే మధ్యఫాల్గుణ మాసాంతానికి చిగురుస్తూ పసర్రంగుతో ఔపిస్తున్నాయి చూడు. ఆవాయ మీదకు ప్రాలిందోయి" అన్నాను. అంటే స్నేహితుడన్నాడు "చిగుర్రంగూ చీర్రంగు ఒక్కటనా?" అన్నాడు. నేనన్నాను "అంతేకాదు. స్త్రీకీ చెట్టుకీ

భేదమేలే" దన్నాను. "ఏం" అన్నాడు. అన్నీ ప్రమాణపూర్వకంగా ప్రతిపాదించాలి నీముందు. ఒక్కటీ స్వయంగా తెలిసికోలేవు" అని ఏమీ అతనికి జెప్పకుండానే నడిచేశాను ఆనాటి నడకంతా.

మఱి కొన్నాళ్ళకతను "నాకేమీ నీవు చెప్పకుండానే అవగాహ నయిందోయి ఓచోట" అన్నాడు. "ఏమిటేలాగు ?" అన్నాను. కాస్సేపు గునిసేడు. కాస్సేపు నసికేడు. తుదకెలా అయితేం చెప్పేడే.

అతనేమో కాలవొడ్డే యీతలతట్టు నడుస్తున్నాట్ట - ఓరోజుదయం 9 గంటలవేళ ఓ కుగ్రామంపోతూ. అప్పటికి రెండు రోజుల క్రిందటి మాట. ఆ కాలవేమో పిల్లకాలువట. అటూ ఇటూ గట్టంచుల పచ్చి కలు మొలిచి, భూమ్మీద మొలిచినా తమ జీవనాధారం నీళ్ళే అన్నట్లు, కాలవలోకి వాలిపోతున్నాయిట గఱికచివళ్ళు. గట్టుమీద యీవల నడ దారీ ఆవల నడదారీకూడా నున్నగా తెల్లగా పట్టెటినట్టుందట. ఈవల గట్టే ఇతడు నడుస్తున్నాట్ట. ఆవలగట్టే ఓ యువకు డో రెండు చక్రాల త్రొక్కుడుబండి నడిపించుకుంటూ తన త్రొక్కుడుబండి కావలగా తనతో పాటు తన బండితోపాటు చటచటనడుస్తూవున్న ఒక యువతితో కబుర్లు చెబుతూ వున్నాట్ట. వాళ్ళు తనకేసి చూణ్ణేలేదట. చూచినా ఇతనెవరో అని అనుకొనేస్థితిలో తమ కబుర్లూ కథా నడుపుకొనే వారల్లేతోచేరట. ఇతనుమాత్రం వాళ్ళను గమనిస్తున్నాట్ట. మాటలస్పష్టంగా వినబడ్డంవల్ల అర్థం గ్రహించలేకపోయినాట్ట గాని నవ్వులు ముమ్మరంగా అన్యోన్యం నవ్వుకుంటూ వున్నప్పుడు మాత్రం అహో యువకుడు ! యువతి ! వారిద్దరిమధ్య త్రొక్కుడుబండి ! విలాసము ! నవ్వు ! అంతా అర్థమై పోయినట్టే సంతృప్తి చెందినాట్ట. వారింకా గబాగబా నడుస్తున్నారట. తానూ వారితోపాటే నడాస్తూన్నాట్ట.

ఈలా వారూ ఇతగాడూ వెడుతూన్నకొద్దీ ఇతగాడింకా కని పెట్టిందేమిట్రా? — ఆ యువతి యొక ఆకుపచ్చరైక తొడుక్కుందట, యొక ఆకుపచ్చరంగు చీర కట్టుకొని చీరకచ్చ వెనక్కు విఱిచికొందట. ఈచేతా ఆచేతా బిళారీగాజులు గుత్తంగా ఎక్కించుకొని కొద్దిపాటి సద్దు చేస్తూందట. ముక్కుపుడక ఎండ పడ్డప్పుడల్లా మెరుస్తూందట. మధ్య మధ్యను స్త్రీ తొక్కుడు బండిమీద చెయ్యేస్తూ వుండేదట యువకుడు వద్దన లేదట. ఎక్కుతావా ఏమిటనట్టు యువకుడో తెల్ల చొక్కా, కుచ్చుపాగా వాడూ ఓమాటుకాలవలో నీళ్ళకేసి, ఓమాటు అక్కడక్కడ కనబడే దిరిసెనచెట్టు పువ్వులకేసి చూస్తూవుండేవాట్ట.

నా మిత్రు "ణ్ణెందుకోయి యీసొదంతా కథా సందర్భానికి రావోయి" అన్నాను. అంటే 'కథాసందర్భమే ఇదంతా' అని ముగించేడు. వర్ణన యెట్లా ముగించేడు? 'ఆ సమయాన్నావరుసంతా నీవుండి చూచేవా అంటే, మేం ముగ్గురం కాలవకొసే గమ్యస్థానంగా పెట్టుకున్నాం గాని ఆ పల్లె యీపల్లె ఆకొంప యీ కొంప ఆ పొలం యీపొలం మా గమ్య స్థానంగా పెట్టుకొని యున్నాం అని అనుకొని యుండవు సుమా" అన్న వాక్యముతో ముగించేడు. "ఈ వాక్యం మిక్కిలి మధురంగా వుందోయి" అని కొంచ మెచ్చరించాను అసలు ముక్క తేలుస్తాడేమోనని. తేల్చడుగా! కొంటె. అందులోనూ ఆవేళ నేను కారణం చెప్పానుకానని కోపం....

మానసకలో నేను కొంచం వెనకపడ్డాను. దాంతో అతగాడు వెనక్కివచ్చి రహస్యంఅన్నట్టు "చూడు" అన్నాడు. నేను కొంచం దగ్గఱసగా చెవొగ్గాను. "ఆ యువకు డా ప్రాంతలో కరణంగారబ్బాయి. ఆ యువతి ఆ కరణంగారి పొలంలో కూలికీ నాలికీపోతూ మఱీ నాలుగురాళ్ళు సంపాదించుకొనే కుఱ్ఱదిసుమా!" అన్నాడు. "నీకెలా

తెలుసు" అన్నాను. "నాభూములున్నాయి వాళ్ళూళ్ళో. ఆ భూములు చూచుకొని నేను బయలుదేరినాను నాదారినే యూళ్ళోకియీవలొడ్డే వాళ్ళేదో కులాసాగా వేళగానివేళ పొలంమీదనుంచి వూళ్ళోకి అవలొడ్డే వస్తున్నారు" అన్నాడు. "పగలు 8 గంటలప్పుడు జరిగిన సంగతింత రహస్యంగా చెప్పడమెందుకు!" అన్నాను. "అదికాదు ఇతరులెవరైనా వింటే భూములూచుసుకోడానికి వెళ్ళినవాడి లక్షణ మా రహస్యాలు కనిపెట్టడం ? అని తిడుతారు. నీవొక్కడవు వింటే తగువులేదు" అన్నాడు. "కానీ నీపొల్లు" అన్నాను.

"వెళ్ళగావెళ్ళగా నాకోవంతెన దొరికింది. ఆ వంతెనదాటి నేనా ఆవలియొడ్డుకు వెళ్ళినాను. వాళ్ళూ నేను ఒకళ్ళకొకళ్ళం తెలియకుండా ఒక మలుపమ్మటే ఊరి మంచీనీళ్ళచెరువు గట్టెక్కాం. ఆ గట్టుమీదా యువకుడు ఆ తన రెండుచక్రాల త్రొక్కుడు బండేంచేశాడంటే ఆపిల్లకు జేరేసి తానే మన్నా పావంచాలంటే మంచినీళ్ళకు దిగాడు.

సరిగ్గా అప్పటి కాయువకునిభార్య ఆ రేవులో మంచినీళ్ళుముంచుతూ వెనక్కితిరిగి చూచింది. చూచేతలికి ఆ వయసుగాడు తనమగడు. వాని త్రొక్కుడుబండి గట్టుమీద పరస్త్రీని చేరమోసి యుంచబడింది.

మొగుణ్ణిచూచి పెళ్ళాంఅంది "గట్టుమీద త్రొక్కుడు బండి గట్టుమీద రావిచెట్టుకు చేరమోసి మరీ మంచినీళ్ళు తాగటానికి రాకూడదూ, అలా అందఱూ చూస్తుండగా దానికివ్వకపోతే" అంది. యువకుడన్నాడు "నేనివ్వలేదు. నేనుదానికి జేరమోపి వచ్చేని. అది ఓచెట్టేనే ! చూడు ! ఆ ఆకుపచ్చకోక ఆ ఆకుపచ్చరైకా చిగురేసిన కొమ్మల్లేవుంది" అన్నాడు.

అంతలో ఆ గట్టుమీదపిల్ల ఆ తొక్కుడుబండెక్కి ఆ చెరువుగట్టు చుట్టూ పలయాలు కొడుతూంది. యువకుడు "పడిపోతావు పడిపోతావు.

ఆ వైపున గండిగండి'' అన్నాడు. అంటూండగనే పడింది. దాని కాలు విఱిగింది. బండాంకరోయింది. ఎన్ని జరగాలో అన్ని జరిగినయి.

భార్యచూస్తూ అంది. ''పడితేం ? కాలువిరిగితేం ? సుడిగాలికి చెట్టు విరిగిపడిపోదూ ? దానికి ఫరవాలేదు. ఇంటికి రాండి'' అంటూ తప్పించుకొని వెళ్ళిపోయింది. ''స్త్రీ చెట్టన్న నీమాట ప్రత్యక్ష ప్రమాణంగా ఆవేళ విన్నానోయి'' అన్నాడు నా మిత్రుడు.

''అప్పుడైన నమ్మావా ?'' అన్నానేను. ''నమ్మకేం చేస్తాను ? నిలుచున్నచెట్టల్లా నడుస్తూన్న చెట్టయింది. నడుస్తూన్నచెట్టల్లా త్రొక్కుడు బండెక్కే చెట్టయింది. తొక్కుడు బండెక్కే చెట్టల్లా సుడిగాలికి పడే చెట్టయింది'' అన్నాడు.

---

| రచన | స్ఫురణ | తొలిప్రకటనము |
|---|---|---|
| 28—8—1931 | నరసాపురం | "వినోదిని" లో |